సాక్షి ఖమ్మం

గురువారం । 13 । జూన్ । 2024

రామయ్య ఆదాయం రూ.1.68 కోట్లు



భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయ హుండీ ఆదాయం 41 రోజులకు గాను రూ.1,68,54,129గా నమోదైంది. దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా ఈ మేరకు ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. వేసవి సెలవుల్లో భక్తులు పెద్ద ఎత్తున స్వామి దర్శనానికి రావడంతో ఆదాయం పెరిగిందని భావిస్తున్నారు. ఇక హుండీల్లో బంగారం, వెండితో పాటు వివిధ దేశాల కరెన్సీ కూడా లభించిందని అధికారులు తెలిపారు.

- భద్రాచలం

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల పర్యటన

- రెండు జిల్లాల్లో 'సీతారామ' పనులు పరిశీలన

ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఖమ్మం నుండి హెలీకాప్టర్‌ ద్వారా బయలుదేరి 11గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి చేరుకుంటారు. అక్కడ సీతారామసాగర్‌ ప్రాజెక్టును వ్యూ పాయింట్‌, సీతారామ ప్రాజెక్ట్‌ క్రాస్‌ రెగ్యులేటర్‌ ప్రాంతం, బీజీ కొత్తూరు వద్ద మొదటి పంప్‌హౌజ్‌ను పరిశీలిస్తారు. ఆతర్వాత పూసుగూడెం వద్ద రెండో పంప్‌హౌజ్‌ను పరిశీలించి సీతారామ ప్రాజెక్ట్‌ పనులను పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తారు. అనంతరం పూసుగూడెం నుండి కెనాల్‌ మీదుగా మూడో పంప్‌హౌజ్‌కు చేరుకుని పరిశీలిస్తారు. అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో ఏన్కూర్‌కు చేరుకుని లింక్‌ కెనాల్‌ పనులను పరిశీలించాక డిప్యూటీ సీఎం, మంత్రులు హైదరాబాద్‌ బయలుదేరతారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్‌: గ్రూప్‌-2, 3 తదితర పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్‌ ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి ఎం.ఏ.మహమూది తెలిపారు. 45 రోజుల పాటు కొనసాగే శిక్షణకు డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 22వ తేదీలోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, ఇతర వివరాల కోసం 97040 03002 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బీఏఎస్‌కు విద్యార్థుల ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్‌: గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న బెస్ట్‌ అవైలబుల్‌ స్కీం(బీఏఎస్‌)కు సంబంధించి బుధవారం విద్యార్థుల ఎంపిక చేపట్టారు. మూడో తరగతిలో 23 సీట్లకు 109 మంది, ఐదో తరగతిలో 12 సీట్లకు 218, ఎనిమిదో తరగతిలో 11 సీట్లకు 117 మంది దరఖాస్తు చేసుకోగా ఖమ్మంలోని గిరిజన భవనంలో సీట్లకు సరిపడా విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన అభివృద్ధిశాఖ కార్యాలయం ఏఓ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, గిరిజన అభివృద్ధి శాఖ ద్వారా బీఏఎస్‌ పథకానికి కేవలం 46 సీట్లు మాత్రమే కేటాయించడం సరికాదని, ఇకనైనా సీట్లు పెంచాలనికోరుతూ గిరిజన సంఘాల నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

న్యాయ సేవా సంస్థలో ఉద్యోగాల భర్తీకి పరీక్షలు

ఖమ్మంలీగల్‌: జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యాన కొనసాగుతున్న లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ కార్యాలయంలో కాంట్రాక్ట్‌ ప్రాతిపదికన ఉద్యోగుల నియామకానికి రాతపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈమేరకు తొలిరోజైన మంగళవారం ఆఫీస్‌ క్లర్క్‌ ఉద్యోగానికి టైపింగ్‌ పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌ పర్యవేక్షించి ఎంపికైన అభ్యర్థికి ఉత్తర్వులను అందజేశారు. అలాగే, బుధవారం డేటా ఎంట్రీ ఆపరేటర్‌ పోస్టు భర్తీకి పరీక్ష నిర్వహించగా, గురువారం ఆఫీస్‌ సబార్డినేట్‌ పోస్టుకు ఇంటర్వ్యూలు జరగనున్నాయి.

రామకృష్ణాపురం యువతికి డాక్టరేట్‌



డాక్టరేట్‌ అందుకుంటున్న పూజ

కల్లూరు: కల్లూరు మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన యుద్దనపూడి పూజకు డాక్టరేట్‌ లభించింది. గ్రామవాసి నాగేశు – శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె అయిన పూజ 'అత్యధిక సాంద్రత పద్ధతిలో మామిడిని సాగు చేసి అధిక దిగుబడులు సాధించే విధానం'పై శ్రీ కొండా లక్ష్మణ్‌ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఎ.కిరణ్‌కుమార్‌ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనా పత్రానికి డాక్టరేట్‌ అందుకుంది. ప్రాథమిక విద్య రామకృష్ణాపురంలో పూర్తిచేసిన ఆమె కల్లూరు, ఖమ్మంలో ఇంటర్‌ చదివాక హైదరాబాద్‌ రాజేంద్రనగర్‌లోని రాష్ట్ర ఉద్యాన కళాశాలలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసింది.

ప్రతీ పైసాకు జవాబుదారీ

- ప్రణాళికాయుతంగా ప్రాజెక్టుల నిర్మాణం
- సీతారామ ప్రాజెక్టులో టన్నెళ్లపై మంత్రి ఉత్తమ్‌తో చర్చిస్తా
- 10 టీఎంసీల నీరు ఉండేలా రిజర్వాయర్‌ నిర్మాణం
- అంతర్జాతీయ స్థాయిలో విద్యాబోధనకు కృషి
- విద్య, నీటిపారుదల శాఖలపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష
- హాజరైన మంత్రులు పొంగులేటి, తుమ్మల



సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్‌ గౌతమ్‌

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు తీసుకొచ్చే లక్ష్యంతో చేపట్టిన సీతారామ ప్రాజెక్టు పనులు మొదలై పదేళ్లు గడవగా, ఇప్పటివరకు రూ.8 వేల కోట్లు వెచ్చించినా గత ప్రభుత్వం చుక్క నీరు ఇవ్వలేకపోయిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ నేపథ్యాన ప్రతీ పైసాకు జవాబుదారీగా ఉంటూ ప్రణాళికాయుతంగా ప్రాజెక్టుల నిర్మాణానికి తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన విద్య, నీటిపారుదల శాఖలపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి సమీక్షించారు. అనంతరం వివరాలను మీడియాకు వెల్లడించారు.

టన్నెళ్లకు సాంకేతిక సమస్యలు

సీతారామ ప్రాజెక్టు నిర్మాణంపై అధికారులతో సమీక్షించాక ట్రయల్‌ రన్‌ కోసం నిధులు కావాలని కోరితే విడుదల చేశామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. అలాగే రెండు టన్నెళ్ల నిర్మాణానికి సాంకేతిక సమస్యలపై ప్రాజెక్ట్‌ పరిశీలనకు గురువారం రానున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌ రెడ్డితో చర్చిస్తామని చెప్పారు. ఏడాదిన్నరలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడమేకాక ప్రతీ పైసా అర్థవంతంగా ఖర్చుపెట్టి నీరు ఇచ్చేందుకు అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. సీతారామను లిఫ్ట్‌ ఇరిగేషన్‌ ప్రాజెక్టుగా నిర్మిస్తూ ఎక్కడా రిజర్వాయర్‌ డిజైన్‌ చేయలేదని.. తాము మాత్రం 10 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా రిజర్వాయర్‌ డిజైన్‌ చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఇక ఎస్సారెస్పీ స్టేజ్‌–2 ద్వారా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాలకు నీరు రావాల్సి ఉన్నందున భూసేకరణ సమస్యను అధిగమించి మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టులను సీతారామ, ఎస్సారెస్పీ, నాగార్జునసాగర్‌ ప్రాజెక్టులతో అనుసంధానించి వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు..

విద్యకు ప్రాధాన్యత

విద్యారంగానికి ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు తమ ప్రభుత్వం వెనుకాడదని భట్టి తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్నామని, అంతర్జాతీయ స్థాయిలో బోధనకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లాలో రెసిడెన్షియల్‌ స్కూళ్ల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు భూములు గుర్తించి ఏడాదిలోగా పూర్తి చేయాలని సూచించారు.

చివరి ఆయకట్టుకూ నీరు

ఈ వ్యవసాయ సీజన్‌లో సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు పూర్తి చేసి చివరి ఆయకట్టుకూ నీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవా లని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. పాలేరుకు సంబంధించి రూ.20 కోట్ల వ్యయంతో 18 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించవచ్చన్నారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సమస్యలను అధిగమించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్‌ వీ.పీ.గౌతమ్‌ మాట్లాడగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్‌, ఉపముఖ్యమంత్రి ఓఎస్డీ కృష్ణభాస్కర్‌, కేఎంసీ కమిషనర్‌ ఆదర్శ్‌ సురభి, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్‌, డి.మధుసూదన్‌ నాయక్‌, నీటిపారుదల శాఖ సీఈ విద్యాసాగర్‌, డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అవసరమైన మేర నిధులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల

ఖమ్మం సహకారనగర్‌: రాష్ట్రప్రభుత్వం విద్యారంగానికి అవసరమైన మేర నిధుల కేటాయింపునకు సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆయన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌ అందజేసి మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలలు తెరిచిన రోజే దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేసిన చరిత్ర తమదేనని తెలిపారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. త్వరలో మెగా డీఎస్సీ ద్వారా సుమారు 10 వేల టీచర్‌ పోస్టుల భర్తీ చేయనున్నామన్నారు. కలెక్టర్‌ గౌతమ్‌, జెడ్పీ చైర్మన్‌ లింగాల కమలరాజ్‌, మేయర్‌ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్‌ ఆదర్శ్‌ సురభి, అదనపు కలెక్టర్‌ బి.సత్యప్రసాద్‌, డిప్యూటీ మేయర్‌ ఫాతిమా జోహారా, డీఈఓ సోమశేఖరశర్మ, కార్పొరేటర్‌ కమర్తపు మురళి, హెచ్‌ఎం శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి యూనిఫామ్‌ అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల

ఆళ్లపాడులో ముగ్గురికి డయేరియా

బోనకల్‌: మండలంలోని రావినూతల, బోనకల్‌, ఆళ్లపాడు గ్రామాల్లో పలువురు జ్వరం, అతిసార బారిన పడ్డారనే సమాచారంతో అప్రమత్తమైన వైద్య, ఆరోగ్య శాఖాధికారులు బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈమేరకు స్థానికులకు పరీక్షలు నిర్వహించగా ఆళ్లపాడులో ముగ్గురికి డయేరియా సోకినట్లు తేలింది. ఈ సందర్భంగా వైద్యాధికారి స్రవంతి మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు, ఆహారం కలుషితమయ్యే ప్రమాదమున్నందున కాచి చల్లార్చిన నీటినే తాగాలని, ఇంట్లో తయారు చేసిన వేడి ఆహారమే తీసుకోవాలని సూచించారు. కాగా, పలు గ్రామాల్లో నీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, డాక్టర్‌ సాయి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో వైద్యపరీక్షలు చేస్తున్న ఉద్యోగులు

నేడు డీసీసీబీ పాలకవర్గ సమావేశం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌(డీసీసీబీ) పాలకవర్గ సమావేశం గురువారం జరగనుంది. ఈమేరకు గురువారం 11 గంటలకు ఖమ్మం లోని బ్యాంక్‌ ప్రధాన కార్యాలయంలో సమావేశం జరుగుతుందని డైరెక్టర్లకు సమాచారం ఇచ్చారు. ఈనెల 6వ తేదీన పాలకవర్గ సమావేశం నిర్వహించగా, తాము పేర్కొన్న అంశాలు అజెండాలో పొందుపర్చలేదని డైరెక్టర్లు బహిష్కరించిన విషయం విదితమే. ఈనేపథ్యాన గురువారం జరిగే సమావేశానికి కూడా అదే అజెండా పొందుపర్చగా.. హాజరుకావాలా, వద్దా అని డైరెక్టర్లు చర్చించుకున్నట్లు తెలిసింది.

తొలిరోజు అంతంతే..

- ప్రభుత్వ పాఠశాలల్లో 43శాతం హాజరు
- 'బడిబాట'లో కొత్తగా 3,829 మందికి ప్రవేశాలు



పాండురంగాపురం పాఠశాలలో మామిడి తోరణాలు కడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్‌: నూతన విద్యాసంవత్సరం బుధవారం ప్రారంభమైంది. అయితే, మొదటి రోజు జిల్లాలోని 1,211 పాఠశాలల్లో 61,314మందికి గాను 26,540మంది విద్యార్థులు(43శాతం) హాజరయ్యారు. ఈమేరకు పలు పాఠశాలల్లో మామిడి తోరణాలతో అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. అలాగే, తొలిరోజే పాఠ్య పుస్తకాలు, నోట్‌ పుస్తకాలు, ఒక జత యూనిఫామ్‌ అందించటంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమైంది. ఖమ్మం లోని ఎన్నెస్పీ కాలనీ హైస్కూల్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం రూరల్‌ మండలం రామన్నపేట హైస్కూల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌ అందించి మాట్లాడారు. కాగా, బడిబాటలో భాగంగా ఇప్పటివరకు ఒకటో తరగతిలో 2,258మంది, రెండు నుంచి పదో తరగతి వరకు 1,571 మంది కలిపి మొత్తంగా 3,829 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ వెల్లడించారు.

ఎనిమిదేళ్లకు తెరుచుకున్న బడి!

రఘునాథపాలెం: ప్రతీ ఆవాసంలో తప్పనిసరి పాఠశాల ఉండాలనే ప్రభుత్వ లక్ష్యంతో ఎనిమిదేళ్ల క్రితం మూతబడిన రఘునాథపాలెం మండలం బూడిదంపాడులోని పాఠశాలను బుధవారం తెరిచారు. ఈ పాఠశాలలో అప్పట్లో నలుగురు విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు ఉండగా, టీచర్లను డిప్యూటేషన్‌పై పంపించి బడిని మూసివేశారు. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీఓ కె.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పాఠశాలను ప్రారంభించగా, 12 మంది విద్యార్థులు చేరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, సీఆర్పీ వెంకటరత్నం, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లుతో పాటు వల్లభనేని సత్యవతి, షేక్‌ మీరా సాహెబ్‌, నీలిమ, రమాదేవి, పద్మ, అంగడాల నరసింహారావు, కేలోతు సురేష్‌ పాల్గొన్నారు. అలాగే, మండలంలోని వాంకుడోత్‌ తండా పాఠశాల, సుకినీ తండాలోని పాఠశాలలు కూడా కొన్నేళ్ల క్రితం మూతపడగా తిరిగి తెరిపించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



విద్యార్థికి అడ్మిషన్‌ ఫాం ఇస్తున్న ఎంపీఓ, తదితరులు

రహదారి పనులు నాణ్యతతో చేపట్టాలి

సమీక్షలో మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్‌: రహదారి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మంలో బుధవారం జాతీయ రహదారుల సంస్థ అధికారులతో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్‌ జాతీయ రహదారి, ఖమ్మం-అశ్వారావుపేట రహదారి పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్లూరు, ధంసలాపురం, వేంసూరుల్లో అవసరమైన చోట జాతీయ రహదారిపైకి వచ్చివెళ్లేందుకు పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాలు పెరగకముందే ఖమ్మం-అశ్వారావుపేట రోడ్డు మరమ్మతులు పూర్తిచేయాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ పనులు నాణ్యతగా జరిగేలా చూడాలని మంత్రి సూచించారు.

కెనడాలో వర్క్‌ వీసాల పేరిట ఘరానా మోసం

- రూ.కోటి మేర పలువురికి టోకరా?
- వైరా పోలీసులకు ఫిర్యాదు చేసిన ఓ బాధితుడు

వైరారూరల్‌: కెనడాలో ఉద్యోగాలకు వర్క్‌ వీసాలు ఇప్పిస్తానని అమాయకులను నమ్మించి రూ.కోటి మేర కాజేసిన వ్యక్తి బాగోతం బయటపడింది. వైరా మండలంలోని గన్నవరం గ్రామానికి దాదాపు 14 మంది సహా తల్లాడ, కల్లూరు మండలాల్లోని పలువురు వైరా మున్సిపాలిటీ పరిధికి చెందిన ఓ వ్యక్తికి నగదు చెల్లించినట్లు సమాచారం. ఇందులో ఓ బాధితుడు మంగళవారం రాత్రి వైరా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది. గన్నవరం గ్రామానికి చెందిన బాధిత యువకుడు డిగ్రీ పూర్తిచేసి కూలీ పనులతో కుటుంబానికి ఆసరాగా ఉంటుండగా ఏడు నెలల కిందట వైరాకు చెందిన ఓ వ్యక్తి, ఆయన భార్య పరిచయమయ్యారు. తనకు కెనడాలో స్నేహితులు ఉన్నారని.. భార్యాభర్తలిద్దరు రూ.15లక్షలు చెల్లిస్తే వర్కింగ్‌ వీసాపై కెనడా వెళ్లొచ్చని నమ్మబలికాడు. దీంతో బాధిత యువకుడు, ఆయన భార్య పాస్‌పోర్ట్‌ తీయించి సదరు వ్యక్తిని కలవగా గతేడాది డిసెంబర్‌ 28న రూ.2లక్షలు తీసుకుని వీసా వచ్చాక మరో రూ.12 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పాడు. అయితే, పదిహేను రోజులకే ఫోన్‌ చేసి భార్యాభర్తలిద్దరికీ వర్కింగ్‌ వీసా వచ్చిందని విమాన చార్జీలకు రూ.3.70 లక్షలు ఇవ్వాలని సూచించాడు. తొలుత తానొక్కడినే వెళ్తానన్న యువకుడు రూ.1.85 లక్షలను చెల్లించి.. హైదరాబాద్‌ నుంచి కెనడా వెళ్లే విమానం ఎక్కగా ఫిబ్రవరి 28న అబుదాబీలో దిగాక ఇమిగ్రేషన్‌ అధికారులు పత్రాలను పరిశీలించి తప్పుడవని నిర్ధారించి హైదరాబాద్‌ పంపించేశారని బాధితుడు వాపోయాడు. ఈమేరకు ఫోన్‌ చేస్తే త్వరలో కెనడా పంపిస్తానని నమ్మబలికి ఫిబ్రవరి 29న మళ్లీ రూ.2,04,500 చెల్లించాలనగా బ్యాంకు ద్వారా నగదు బదిలీ చేశానని తెలిపాడు. అనంతరం మార్చి 4న హైదరాబాద్‌ నుండి కెనడా వెళ్తే అక్కడి విమానాశ్రయంలో అధికారులు పత్రాలు నకిలీవనీ చెప్పడంతో ఇండియా వచ్చేశానని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే, వర్కింగ్‌ వీసా పేరుతో విడతల వారీగా తీసుకున్న నగదు ఇవ్వాలని కోరితే సదరు వ్యక్తి బెదిరించాడని వైరా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

- లారీ ఢీకొని కాంట్రాక్టర్‌.. ట్రాక్టర్‌ ఢీకొనడంతో బాలుడు
- రెండు కుటుంబాల్లో విషాదం



నాగార్జున (ఫైల్‌)

ఖమ్మంక్రైం/ఖమ్మం రూరల్‌: జిల్లాలో బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డుప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఓ మున్సిపల్‌ కాంట్రాక్టర్‌తో పాటు అప్పుడే పాఠశాలకు వెళ్లివచ్చిన బాలుడు ఈ ఘటనల్లో మృతి చెందగా రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం ద్వారకానగర్‌ ప్రాంతానికి చెందిన మేడా నాగార్జున(35) తన తండ్రి తిరుమలరావుతో కలిసి మున్సిపాలిటీ పారిశుద్ధ్య పనుల కాంట్రాక్టులు చేస్తున్నాడు. ఈమేరకు బుధవారం ఉదయం నాగార్జున శ్రీశ్రీ సర్కిల్‌ ప్రాంతానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా వెనకగా వచ్చిన డస్ట్‌లోడ్‌ టిప్పర్‌ ఆయన ద్విచక్రవాహనం హ్యాండిల్‌ను తాకడంతో అదుపుతప్పి కింద పడ్డాడు. అయితే, వేగంగా ఉన్న టిప్పర్‌ టైర్లు నాగార్జున తలపైకి ఎక్కడంతో నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వెంటనే టిప్పర్‌ డ్రైవర్‌ పారిపోయాడు. ఈమేరకు పోలీసులు నాగార్జున మృతదేహాన్ని అన్నం ట్రస్ట్‌ చైర్మన్‌ శ్రీనివాసరావు సహకారంతో మార్చురీకి తరలించగా.. ఆయన తల్లి సుజాత, భార్య రజిని గుండెలవిసేలా రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్‌ సీఐ బాలకృష్ణ తెలిపారు.



వీరేందర్‌ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

మట్టి ట్రాక్టర్‌ ఢీకొని బాలుడు

ఖమ్మం రూరల్‌ మండలం ముత్తగూడెంలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ ఢీకొట్టడంతో బాలుడు గునిగంటి వీరేందర్‌(9) మృతి చెందాడు. గ్రామంలోని డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో నివాసముండే వీరేందర్‌ తల్లిదండ్రులు కూలీనాలీ పనులు చేసుకుంటున్నారు. గ్రామంలో రేషన్‌ బియ్యం ఇస్తున్నారో లేదో తెలుసుకోవడానికి అప్పుడే పాఠశాల నుంచి వచ్చిన వీరేందర్‌ సైకిల్‌పై వెళ్లాడు. షాపు నుంచి తిరిగి వస్తుండగా వెనుక నుండి అతివేగంగా మట్టి ట్రాక్టర్‌ ఢీకొట్టడంతో వీరేందర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యాసంవత్సరం మొదటి రోజు సంతోషంగా పాఠశాలకు వెళ్లొచ్చిన కుమారుడు కన్నుమూయడంతో ఆయన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

క్రైం న్యూస్

కుటుంబ కలహాలు.. మరో పక్క నోటీసు

మనస్తాపంతో ఆర్టీసీ డ్రైవర్‌ ఆత్మహత్య



సముద్రాల సైదులు కృష్ణ (ఫైల్‌)

వైరారూరల్‌: కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లడం.. ఇంతలోనే విధుల్లో అలసత్వం వహిస్తున్నాడని అధికారులు నోటీసు ఇవ్వడంతో మనస్తాపం చెందిన ఆర్టీసీ డ్రైవర్‌ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... వైరా మండలంలోని నారపునేనిపల్లికి చెందిన సముద్రాల సైదులు కృష్ణ(44) కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల గొడవలతో ఆయన భార్య పుట్టింటికి వెళ్లింది. ఇంతలోనే రెండు రోజుల క్రితం కృష్ణ విధినిర్వహణలో ఆలసత్వం వహిస్తున్నాడని అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో మనస్తాపం చెంది సైదులు కృష్ణ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

భార్య ఆరోగ్యం బాగా లేదని...

ఖమ్మంక్రైం: భార్య అనారోగ్యానికి గురైందనే బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నేలకొండపల్లి ముజ్జుగూడెంకు చెందిన కోట నర్సింహారావు(58) ఖమ్మం మార్కెట్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం ఆయన భార్య పుష్పవతి పక్షవాతంతో మంచానికి పరిమితమైంది. అప్పటినుంచి నర్సింహారావు మద్యానికి బానిస కాగా.. బుధవారం మార్కెట్‌లో మద్యంలో పురుగులమందు కలిపి తాగాడు. దీంతో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడని సీఐ రమేష్‌ తెలిపారు.

ప్రాణం తీసిన కరెంట్‌షాక్‌

- కొణిజర్ల ఆయుర్వేద వైద్యశాలలో ఘటన
- పరిహారం కోసం ఎలక్ట్రీషియన్ బంధువుల ఆందోళన





రహదారిపై మృతదేహంతో నిరసన తెలుపుతున్న బంధువులు (ఇన్‌సెట్‌) సతీష్‌ (ఫైల్‌)

కొణిజర్ల: ఆయుర్వేద వైద్యశాలలో మరమ్మతుల నిమిత్తం వచ్చిన ప్రైవేట్‌ ఎలక్ట్రీషియన్‌ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన కొణిజర్లలో బుధవారం చోటు చేసుకుంది. ఆయన భార్య, ఏడాది కుమార్తెకు పరిహారం చెల్లించాలనే డిమాండ్‌తో ఆయన బంధువులు చేపట్టిన ఆందోళన రాత్రి 9గంటల వరకు కొనసాగింది. వైరా మండలం గొల్లపూడికి చెందిన నారగాని సతీష్‌(28) ఖమ్మంలో ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కొణిజర్ల ఆయుర్వేద వైద్యశాలలో మరమ్మతుల నిమిత్తం సిబ్బందికి పరిచయం ఉన్న సతీష్‌ను బుధవారం పిలిపించారు. ఆయన వెల్‌నెస్‌ సెంటర్‌ షెడ్డుకు విద్యుత్‌ వైరింగ్‌ చేస్తుండగా షెడ్డుకు ఉన్న ఐరన్‌ గ్రిల్స్‌కు వైర్‌ తాకడంతో షాక్‌కు గురై వేలాడాడు. స్థానికులు, సిబ్బంది కర్రలతో వైర్‌ను కొట్టగా సతీష్‌ కింద పడినా అపస్మారక స్థితిలోకి చేరుకున్న ఆయనకు సీపీఆర్‌ చేసి ఖమ్మం తరలించారు. ఖమ్మం ఆస్పత్రికి వెళ్లేలోగా సతీష్‌ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించగా ఆయన బంధువులు పెద్దసంఖ్యలో చేరుకుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. కానీ కొణిజర్ల ఆయుర్వేద వైద్యశాల ఉద్యోగులెవరూ రాకపోవడంతో ఆగ్రహంగా మధ్యాహ్నం 3గంటలకు మృతదేహాన్ని తిరిగి కొణిజర్ల తీసుకొచ్చి ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధితుడు షాక్‌కు గురైతే ప్రాథమిక చికిత్స చేయలేదని మండిపడగా సీఐ సాగర్‌నాయక్‌, ఎస్‌ఐ శంకరరావు చర్చించినా నిరసన వీడలేదు.

రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో

దాదాపు రెండు గంటల పాటు పీహెచ్‌సీలో ఎదురుచూసినా ఆయుర్వేద వైద్యశాల వైద్యులు, సిబ్బంది రాకపోవడంతో సతీష్‌ బంధువులు మృతదేహంతో ఖమ్మం – సత్తుపల్లి రాష్ట్రీయ రహదారిపై బైఠాయించారు. వీరికి స్థానికులు మద్దతుగా నిలవడంతో రహదారికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయి. దీంతో సీఐ సాగర్‌నాయక్‌, ఎస్‌ఐలు భాగ్యరాజ్‌, శంకరరావు చర్చించగా ఆర గంటల అనంతరం మళ్లీ మృతదేహాన్ని పీహెచ్‌సీలోకి తరలించారు. ఆయుర్వేద వైద్యురాలు సాదియా తరఫున వైద్యులు, స్థానిక నాయకులు చర్చించగా.. హామీలపై స్పష్టత లేకపోవడంతో ఆందోళన కొనసాగింది. రాత్రి 8గంటలకు డీఎంహెచ్‌ఓ మాలతి, ఆర్‌డీఓ గణేష్‌ చేరుకుని సతీష్‌ భార్యకు ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్తుకు, క్రమశిక్షణకు దిక్సూచి - మన విద్యాలయాలు

ADVT. SPL



రెజొనెన్స్ ఇన్ఫో

ప్రస్తుత పోటీ ప్రపంచంలో పరిస్థితులకు తగినట్లు విద్యార్థులను చదువులో ప్రోత్సహించటంతో పాటు నైపుణ్యమైన బోధన అందిస్తున్నట్లు వీడీవోస్ కాలనీలోని రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాల డైరెక్టర్లు ఆర్.వీ.నాగేంద్ర కుమార్, కొండా శ్రీధర్‌రావు, నీలిమ తెలిపారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పాఠశాల స్థాయి నుంచే ఐఐటీ ఫౌండేషన్ కూడా అమలుచేస్తున్నామని వెల్లడించారు. ఐఐటీల్లో తమ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, సమాజంలో చదువుతో పాటు క్రీడా సాంస్కృతిక రంగాలపై అవగాహన కల్పిస్తున్న ఏకైక విద్యాసంస్థ తమదే నని డైరెక్టర్లు తెలిపారు.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్..

ఖమ్మంసహకారనగర్: ఈ ఏడాది ఎస్సెస్సీ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమమైన ఫలితాలు సాధించారని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కరస్పాండెంట్ జాఫర్ మతిన్ తెలిపారు. ఈ ఏడాది నుంచి కొత్త భవనంలో తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని రకాల వసతులతోపాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ప్రవేశాలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు.

క్రియేటివ్ హైస్కూల్

ఖమ్మంలోని హర్కరా బావి సెంటర్‌లో ఉన్న క్రియేటివ్ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ తెలిపారు. 40 మంది విద్యార్థుల్లో ముగ్గురు 10జీపీఏ, 27 మందికి 9 కంటే ఎక్కువ జీపీఏ సాధించారని చెప్పారు. వీరిలో 19 మంది విద్యార్థులు నర్సరీ నుంచి ఇదే పాఠశాలలో చదివారని తెలిపారు. ప్రతీ తరగతి గదిలో పరిమిత సంఖ్యలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, కరాటే, డ్యాన్స్‌లో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

నిర్మల హైస్కూల్

పదో తరగతి ఫలితాల్లో ఆర్.ధీరజ్ శివసాయి 10 జీపీఏ సాధించారని, మరికొందరు 9కిపైగా జీపీఏ సాధించారని బల్లేపల్లిలోని నిర్మల హైస్కూల్ కరస్పాండెంట్ యోగిరామ్ వెల్లడించారు. తమ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

సర్వజ్ఞ స్కూల్

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆలోచనలకు అనుగుణంగా బోధన సాగించడంలో నిరంతరం పరితపించేది సర్వజ్ఞ పాఠశాల అని డైరెక్టర్లు ఆర్.వీ.నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక వసతులు, ఏసీ క్యాంపస్‌గా పాఠశాలను నెలకొల్పామని చెప్పారు. అనతికాలంలోనే ప్రశంసలు అందుకున్న ఏకైక విద్యాసంస్థ తమది అని.. విద్యార్థులకు చదువుతో పాటు అన్ని అంశాల్లో శిక్షణ ఇప్పిస్తుండగా జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చారని. చిన్న వయస్సులోనే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించారని వెల్లడించారు.

రెజొనెన్స్ శ్రీనగర్

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమ విద్యనందించేందుకు శ్రీనగర్ కాలనీలో ఉన్న రెజొనెన్స్ స్కూల్‌ను ఎన్నుకోవాలని చైర్మన్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. తమ స్కూల్‌లో ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌ను ఆధునిక పద్ధతుల్లో బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ఆటపాటల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తూ అనుభవం, అంకిత భావంతో బోధించే సిబ్బందితో బోధన తమ స్కూల్ ప్రత్యేకత అని చెప్పారు. అన్ని రకాలుగా విద్యార్థులు ఎదిగేందుకు అద్భుత విద్యాక్షేత్రంగా రెజొనెన్స్ స్కూల్ నిలుస్తోందని తెలిపారు.



ప్రతిమ కిడ్జ్

పిల్లల చదువుల ప్రపంచంగా ఖమ్మం మైత్రినగర్ మమత కాలేజీ న్యూగేట్ ఎదురుగా ఉన్న ప్రతిమ కిడ్జ్ ప్రీ స్కూల్ తల్లిదండ్రుల మన్ననలు పొందిందని యాజమాన్యం వెల్లడించారు. నర్సరీ నుండి ఎస్ఆర్ కేజీ వరకు చక్కటి తరగతి గదులు, ఉన్నత విద్యార్హతలు, అంకితభావం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో బోధిస్తున్నట్లు తెలిపారు. చదువుతోపాటు ఆటలతో ఇంటిని మైమరిపించేలా ఇన్నర్ ప్లే గ్రౌండ్ ఉందని, ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, ఆరోగ్య రక్షణ, విద్యార్థుల తల్లిదండ్రులకు స్పెషల్ న్యూట్రీషన్ గైడ్‌లైన్స్ ఇప్పిస్తున్నామని చెప్పారు. ఏసీతో కూడిన డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అనుభవం కలిగిన టీచర్లు ఉన్న తమ పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, వివరాలకు 97053 62299 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీబీఎం పాఠశాల

పదో తరగతి ఫలితాల్లో నాయుడుపేటలోని బీబీఎం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని డైరెక్టర్ జి. కాంతారావు, కరస్పాండెంట్ జి.నాగమణి తెలిపారు. తమ విద్యార్థులు టి.బాలసాయి, యు.సాత్విక్ 10 జీపీఏ సాధించారని పేర్కొన్నారు. అలాగే, లోహిత్9 .8 జీపీఏ, టి.భువన శ్రీ 9.7, బి.శివగోపాల్ 9.7, సాయిభవాని 9.5, ఎం.హర్షిత్ 9.5 జీపీఏ సాధించారని పేర్కొన్నారు. తమ పాఠశాలలో ఆటపాటలతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన ఉంటుందని వెల్లడించారు.

ట్రైనిటాట్స్ హైస్కూల్

ఖమ్మం బుర్హాన్‌పురంలోని ట్రైనిటాట్స్ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అత్యధిక గ్రేడ్లు సాధించారని కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ తెలిపారు. పదో తరగతి ఫలితాలలో తొమ్మిది సార్లు 100 శాతం ఫలితాలు కాక అత్యధికంగా పది జీపీఏ తమ విద్యార్థులు సాధించారని ఆయన పేర్కొన్నారు. ఒత్తిడి లేకపోవడమే కాక విలువలు కలిగిన విద్యనందించడమే లక్ష్యంగా తమ పాఠశాల ఉపాధ్యాయులు, యాజమాన్యం పనిచేస్తుందని తెలిపారు. ప్రైమరీ నుంచే విద్యార్థులకు ఆటపాటలతో విలువలు కలిగిన విద్యను అందిస్తున్నామని.. తద్వారా భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నామని కరస్పాండెంట్ పేర్కొన్నారు.

వెలాసిటీ జూనియర్ కాలేజీ

సాధారణ విద్యార్థులకు సైతం అత్యుత్తమ మార్కులు, ర్యాంక్‌లు సాధించేలా కృషి చేస్తూ మధ్య తరగతి కుటుంబాల్లో ఆశాదీపమై నిలుస్తున్నామని వెలాసిటీ జూనియర్ కాలేజీ చైర్మన్, ప్రిన్సిపాల్ శెట్టి లక్ష్మణ్‌రావు, సెక్రటరీ, కరస్పాండెంట్ మల్లోలు రవి, అకడమిక్ డీన్ ఎం.డీ.యాకూబ్ తెలిపారు. 2018లో స్థాపించిన కళాశాల ద్వారా జూనియర్ ఇంటర్, సీనియర్ ఇంటర్‌లో తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడమే కాక జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటారని వెల్లడించారు. ఎంసెట్‌లోనూ తమ విద్యార్థులు వెయ్యి లోపు ర్యాంకులతో ఉత్తమ ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు సాధిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ కళాశాలల్లో పిల్లలను చేర్పించి వారిని మానసిక ఒత్తిడికి గురి చేసి, తల్లిదండ్రులు ఆర్థిక భారం మోసేబదులు పిల్లల బంగారు భవిష్యత్ కోసం తమ కళాశాలను ఎంచుకోవాలని కోరారు.


మై స్కూల్..

ఫలితాలు ఏవైనా మై స్కూల్ విద్యార్థులు విజయ భేరి మోగిస్తున్నారని ప్రిన్సిపాల్ చింతిరాల శ్రీనివాస్ తెలిపారు. వివిధ రకాల పోటీ పరీక్షల్లోనే కాక పదో తరగతి ఫలితాల్లోనైనా తమ విద్యార్థులు సత్తా చాటారని వెల్లడించారు. పదో తరగతి ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించిన విద్యార్థులు సైతం ఉన్నారన్నారు. సీహెచ్.యస్విత 9.8జిపిఏ, రాహిత్య శర్మ 9.5, ప్రవళిక 9.3 జీపీఏతో పాటు అనేక మంది విద్యార్థులు అత్యధిక జీపీఏ సాధించారని తెలిపారు.

శ్రీవివేకానంద విద్యానికేతన్

మామిళ్లగూడెంలోని శ్రీవివేకానంద విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణతతోపాటు ఉత్తమ ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఇద్దరు విద్యార్థులు పది జీపీఏ, నలుగురు 9.8 జీపీఏ, 10 మంది 9 జీపీఏ సాధించారని పేర్కొన్నారు. పాఠశాల ప్రారంభించిన 49 ఏళ్లలో చదివిన విద్యార్థులు ప్రస్తుతం అత్యున్నత పదవులలో కొనసాగుతున్నారని వెల్లడించారు. ప్రతీ విద్యార్థి విద్యలోనే కాక అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు కరస్పాండెంట్ తెలిపారు.











ఏజెన్సీలో విద్యా కుసుమం

భద్రాచలంటౌన్ : విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు లిటిల్ ఫ్లవర్స్ స్కూల్, కళాశాలలు పట్టుగొమ్మల్లా ఉపకరిస్తున్నాయని విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో గత 45 ఏళ్లుగా ఉత్తమ విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యాసంస్థల వ్యవస్థాపకులు మాగంటి సూర్యం స్ఫూర్తితో ప్రస్తుతం తాము నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎన్నో రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

క్రియేటివ్‌లో బ్యాక్ టూ స్కూల్

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం హర్కారా బావిసెంటర్‌లోని క్రియేటివ్ హైస్కూల్‌లో విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా బ్యాక్ టూ స్కూల్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కరస్పాండెంట్ బిజ్జాల కమలాకర్, డైరెక్టర్ బిజ్జాల కౌశిక్ తెలిపారు. ఈమేరకు పాఠశాలలో ప్లే గ్రూప్, ఏసీ తరగతి గదులను ప్రారంభించారు. విద్యార్థులకు స్వాగతం పలికి కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చేలా ఉపాధ్యాయులతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కరస్పాండెంట్, డైరెక్టర్ తెలిపారు.



విద్యార్థులతో కరస్పాండెంట్ కమలాకర్ తదితరులు



